క్లుప్తంగా

నిర్మాణాలను వేగవంతం చేయాలి



నెల్లూరు సిటీ: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీలో శనివారం పర్యటించిన ఆమె మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, తదితర సౌకర్యాలను కల్పించాలని సూచించారు. హౌసింగ్ కార్పొరేషన్ డీఈ దయాకర్ పాల్గొన్నారు.

ఇళ్లను తొలగించొద్దని వినతి



నెల్లూరు రూరల్: తమ ఇళ్లను తొలగించొద్దని నగరంలోని 42వ డివిజన్ కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డు ప్రాంతానికి చెందిన పలువురు కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేనేజర్ ఇనాయతుల్లాకు వినతిపత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఉంటున్న ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు చెప్తున్నారని, ఇది సమంజసం కాదని పేర్కొన్నారు. తొలగింపును తాత్కాలికంగా నిలిపేయాలంటూ కోర్టు ఆదేశాలు సైతం ఉన్నాయని వివరించారు. అబ్దుల్ నబీ, రిజ్వానా, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ ఆర్థిక అవశ్యకత, విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ శనివారంతో ముగిసింది. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి వర్చువల్ పద్ధతిలో విశాఖపట్నం నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు డివిజన్ కార్యాలయం నుంచి కృష్ణప్రసాద్, లక్ష్మీపతి, కావలి డివిజన్ నుంచి పెంచలయ్య, నెల్లూరు టౌన్ డివిజన్ నుంచి వెంకటేశ్వర్లు, విజయ్‌భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ అంశాలను ఆయన దృష్టికి వీరు తీసుకెళ్లారు. ప్రజలపై రూపాయి కూడా భారం వేయకుండా ప్రతిపాదనలను అందించిన డిస్కమ్ సీఎండీలను నాగార్జునరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డీఈటీ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, జయకృష్ణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, అశోక్, అసిస్టెంట్ ఇంజినీర్లు శ్రుతి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బాకీ విషయమై స్నేహితుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితులను నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బాకీ విషయమై కొత్తకాలువ సెంటర్‌కు చెందిన పవన్‌పై ఆత్మకూరు బస్టాండ్ వెనుక వైపున స్నేహితులు రాము, మోహన్, సంతోష్, విజయ్ హత్యాయత్నానికి గురువారం పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): ఎస్సై స్థాయి అధికారి సతీమణి అంటూ ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని లేడీస్ హాస్టల్లో ఓ మహిళ 15 రోజుల క్రితం చేరారు. తన భర్త ఎస్సై అని.. ప్రభుత్వోద్యోగ కోచింగ్ నిమిత్తం హాస్టల్లో చేరుతున్నానంటూ సదరు అధికారి ఫోన్ నంబర్‌ను రెఫరెన్స్ నిమిత్తం నిర్వాహకులకు ఇచ్చారు. శనివారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో హాస్టల్ నుంచి మహిళ బయటకెళ్లారు. ఈ క్రమంలో నెల్లూరు చేరుకున్న ఆమె తల్లి హాస్టల్‌కు వచ్చారు. తన కుమార్తె రాత్రి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటానంటూ కన్నీళ్లు పెట్టుకుందని.. ఆమె ఎక్కడని హాస్టల్ నిర్వాహకులను ప్రశ్నించారు. వారు తెలియదని చెప్పడం.. కుమార్తెకు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్న సమయంలో కుమార్తె హాస్టల్‌కు వచ్చారని నిర్వాహకులు ఫోన్ చేశారు. హాస్టల్‌కు వెళ్లి ఆమెను ప్రశ్నించగా.. గొడవ పెట్టుకోవడంతో తల్లి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తన భర్తతో బయటకెళ్లానని.. ఆయన ముందే నిద్రమాత్రలను మింగానని హాస్టల్ నిర్వాహకులకు మహిళ తెలిపారు. దీంతో చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించేందుకు యత్నించగా, ఆమె నిరాకరించారు. చివరికి బాలాజీనగర్ పోలీసుల సాయంతో జయభారత్ హాస్పిటల్లో చేర్పించారు. ఘటనపై పోలీసులు గోప్యంగా విచారణ సాగిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో తై అమావాస్య



నెల్లూరు(బృందావనం): తై అమావాస్యను పురస్కరించుకొని నగరంలోని వేమాలశెట్టిబావి ప్రాంగణంలో గల వైద్య వీరరాఘవస్వామి దేవస్థానానికి భక్తులు శనివారం పోటెత్తారు. తమ కోర్కెలు నెరవేరాలని కోరుకుంటూ దేవస్థాన ప్రాంగణంలోని బలిపీఠం వద్ద వైద్య వీరరాఘవస్వామి, వేమాలమ్మ, వేమాలయ్యలకు పూజలను నిర్వహించారు. అనంతరం ఉప్పు, మిరియాలను సమర్పించారు. కోర్కెలు నెరవేరిన భక్తులు వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి, టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

దర్శించుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

వైద్య వీరరాఘవస్వామిని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారు, వేమాలమ్మ, వేమాలయ్యలకు ప్రత్యేక పూజలు చేశారు. వేమాలశెట్టి బావిలో బెల్లాన్ని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సుజిత దంపతులు సమర్పించారు. విశేషంగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తును ఏర్పాటు చేసిన ఎస్పీ విజయారావుకు కృతజ్ఞతలను తెలియజేశారు. కార్పొరేటర్ శ్రీనివాస్‌యాదవ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మురళీకృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.





బెల్లాన్ని సమర్పిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



వేమాలశెట్టి బావి వద్దకు పోటెత్తిన భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు

రంగనాథుడికి బంగారు గరుడసేవ



నెల్లూరు(బృందావనం): తై అమావాస్యను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బంగారు గరుడసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో తిరుమంజనం, తదితరాలను విశేషంగా జరిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా పురంధరదాసు ఆరాధన



నెల్లూరు(బృందావనం):కర్ణాటక సంగీత పితామహా పురంధరదాసు ఆరాధనోత్సవాలను శనివారం నిర్వహించారు. సంతపేటలోని వ్యాసరాజ మఠంలో పురంధరదాసు భజనమండలి అధ్యక్షురాలు నాగమణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. సంతపేటలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు నగర సంకీర్తనను నిర్వహించారు. కోలాట ప్రదర్శన, క్విజ్ పోటీలను జరిపారు. వ్యాసరాజ మఠం ప్రాంగణంలోని రమా సహిత సత్యనారాయణస్వామి మందిరంలో పంచామృతాభిషేకం, తదితరాలను జరిపారు. రమామణి, కంబాలూరు వ్యాసపీఠ ప్రతిష్టాన గౌరవాధ్యక్షుడు శ్రీధరాచార్య, నాగరాజారావు, మఠం మేనేజర్ రవీంద్రబాబు, గౌరవ కార్యనిర్వాహకుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



నెల్లూరు రూరల్: లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వాసిలికి చెందిన పది నెలల చిన్నారి వైద్యానికి పలువురు చేయూతనందించారు. డైకస్‌రోడ్డులోని రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో రూ.10 వేలను చిన్నారి తల్లికి శనివారం అందజేశారు. మాలకొండయ్య మనవడు సాయి శ్రీరామ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ మొత్తాన్ని వితరణ చేశారు. కౌశిక ప్రియాంక జన్మదినాన్ని పురస్కరించుకొని రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను తండ్రి రవితేజ అందజేశారు. రూ.1500తో పాటు బియ్యం బస్తాను అర్షియా, జాహిద్, గ్లోరీ ఇచ్చారు. ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, శ్రీధర్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ఖాజామస్తాన్, రాజేష్, నారాయణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలపై 26 నుంచి నిషేధం

నెల్లూరు సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ ఫ్లెక్సీల తయారీ, వినియోగాన్ని ఈ నెల 26 నుంచి నిషేధించనున్నామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్, హెల్త్ విభాగాధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీ మెటీరియల్‌ను తయారు చేయడం.. దిగుమతి, బ్యానర్ల ముద్రణ, వినియోగం, తదితరాలపై నిషేధం ఉంటుందని చెప్పారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక్ డ్రైవ్‌ను నిర్వహించి, చట్టాన్ని అతిక్రమించిన వారిపై పర్యావరణ రక్షణ చట్టం 1996 మేరకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను నగరంలోని వాణిజ్య సముదాయాల్లో ప్రదర్శిస్తే నిర్వాహకులకు చదరపు అడుగుకు రూ.100 చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రాజశేఖర్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది గడువుకు వినతి



మాట్లాడుతున్న గోపీకృష్ణ


నెల్లూరు(బారకాసు): ఫ్లెక్సీల ప్రింటింగ్‌ను కొనసాగించేందుకు మరో ఏడాది పాటు గడువివ్వాలని నెల్లూరు డిస్ట్రిక్ట్ ఫ్లెక్సీ ప్రింటింగ్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ కోరారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. క్లాత్ బ్యానర్లను ముద్రించేందుకు అవసరమైన మెషినరీ లేని కారణంగా తమ వ్యాపారాలు మూతపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఫ్లెక్సీ ప్రింటింగ్ వ్యాపారాలను మూసేస్తే వీధినపడే అవకాశం ఉందన్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం



నెల్లూరు(వేదాయపాళెం): ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పనిచేసిన గానాల రామ్మూర్తి విశ్వబ్రాహ్మణులు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటశేషయ్య ఆచారి పేర్కొన్నారు. సిరి మల్టీప్లెక్స్ సమీపంలోని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా కార్యాలయంలో రామ్మూర్తి జయంతిని శనివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘ గౌరవాధ్యక్షుడు జానకిరామయ్య, రఘురామయ్య, మోహన్, రఘునాథ్, బాబు, శివప్రసాద్, చంద్ర, మదన్, మహేశ్వరి, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్‌ను సెట్నెల్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. యువజన శాఖ అధికారి మహేంద్రరెడ్డి, దశరథరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

నెల్లూరు (టౌన్): అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలను నిర్వహించారు. ఆర్జేడీ సుబ్బారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఎంఈఓ తిరుపాల్, ఎస్ఎస్ఏ ఎంఓ సుధీర్‌బాబు పర్యవేక్షించారు. న్యాయ నిర్ణేతలుగా జోయల్, రాములు, తాతాచార్యులు, తిరుమలేష్, చంద్రమౌళి, ఫణికుమార్ వ్యవహరించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

యువత పాత్ర ఎంతో కీలకం



సత్కరిస్తున్న నేతలు

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ఆయా ప్రాంతాల అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నవలాకులతోటలోని సీబీవై కల్యాణ మండపంలో పార్టీ నేత చక్రవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. చక్రవర్ధన్‌రెడ్డికి పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని, ఈయన తరఫున తన కార్యాలయానికి ఎవరొచ్చినా సాయాన్ని అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం చక్రవర్ధన్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. తొలుత యువకులతో కలిసి భారీ ర్యాలీని నిర్వహించారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్, నేతలు కమలాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటేష్, ప్రసాద్, సురేంద్ర, కరిముల్లా, సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి, అంకబాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ హరిత సూచించారు. 54వ డివిజన్లోని భగత్‌సింగ్‌కాలనీలో గల వార్డు సచివాలయాన్ని శనివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజలతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సేవలను నిర్ణీత గడువులోపు అందించాలని ఆదేశించారు. జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వేను వెంటనే ప్రారంభించాలని చెప్పారు.

ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం



డెటాల్ కిట్లను ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, తదితరులు

నెల్లూరు (టౌన్): పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎస్ఏఆర్డీఎస్ గ్రామాలయ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. డెటాల్ స్కూల్ హైజీన్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రత సంస్కృతిని పెంపొందించే దిశగా ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. సంగం, ఆత్మకూరు మండలాల్లోని 60 పాఠశాలల నుంచి శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. అనంతరం ఎస్ఏఆర్డీఎస్ సంస్థ సీఈఓ సునీల్ మాట్లాడారు. నెల్లూరు, కడప, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని 548 పాఠశాలల్లో డీబీఎస్సై కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం డెటాల్‌కు సంబంధించిన కిట్లను ఆవిష్కరించారు. సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, గ్రామాలయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లోకనాథం, ఎస్పీసీ జిల్లా కోఆర్డినేటర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

- యూ డైస్ ఆన్‌లైన్ ఎంట్రీకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఎంఈఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు హాజరయ్యారు. అనంతరం ఆర్జేడీ సుబ్బారావును సత్కరించారు. ఏపీసీ ఉషారాణి పాల్గొన్నారు.

శ్రీనివాసరావును కలిసిన ఎన్జీఓ నేతలు



నెల్లూరు(అర్బన్): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బండి శ్రీనివాసరావును అసోసియేషన్ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. చెన్నై వెళ్తూ మార్గమధ్యలో నగరంలోని ఓ హోటల్లో ఆగిన ఆయన్ను కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, కార్యదర్శి వెంకటస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, కోశాధికారి వెంకటేశ్వర్లు, నిర్వహణ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విలాసాలకు అలవాటుపడి.. దొంగలుగా మారి

- ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): వారిద్దరూ యాక్టింగ్ డ్రైవర్లు.. సంపాదించిన మొత్తం వారి విలాసాలకు సరిపోకపోవడంతో గొలుసు దొంగలుగా మారారు. ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని గొలుసు దొంగతనాలకు పాల్పడుతూ చివరికి జైలుపాలయ్యారు. నగరంలోని తన కార్యాలయంలో నిందితుల వివరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి విలేకరులకు శనివారం వెల్లడించారు. సరస్వతీనగర్‌లోని వినాయక ఆలయ సమీపానికి చెందిన రాజా సాయిచంద్ అలియాస్ చందు, వంశీకృష్ణ అలియాస్ వంశీ యాక్టింగ్ డ్రైవర్లు. చెడు వ్యసనాలు, విలాసాలకు వీరు బానిసలయ్యారు. సంపాదించిన మొత్తం వీరి వ్యసనాలు, విలాసాలకు సరిపోకపోవడంతో గొలుసు దొంగలుగా మారారు. కారు, బైక్‌లలో తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడల్లోని బంగారు గొలుసులను దొంగలించి.. వాటి ద్వారా వచ్చిన సొమ్ముతో జీవిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో నవాబుపేట పరిధిలోని పత్తివారిస్కూల్ సమీపంలో ఒంటరిగా వెళ్తున్న మహిళ మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును అపహరించారు. ఈ నెల 19న చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని రామ్‌జీనగర్ వద్ద ఉమశ్రీ మెడలోని బంగారు గొలుసును అపహరించేందుకు యత్నిస్తుండగా, బాధితురాలు ప్రతిఘటించారు. దీంతో ఆమె మెడలోని గొలుసు సగం దుండగుడు చేతికి చిక్కగా.. మిగిలిన సగభాగం ఆమె చేతిలో ఉండిపోయింది. చోరీ ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.25 లక్షల విలువజేసే బంగారు గొలుసులు, కారు, టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్, ఎస్సై సుమన్, క్రైమ్ పార్టీ ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు సుధాకర్, శివకుమార్, కానిస్టేబుళ్లు తిరుపతి, శివకుమార్, ప్రభాకర్‌ను డీఎస్పీ అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నెల్లూరు రూరల్: సంక్రాంతిని పురస్కరించుకొని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శనివారం అందజేశారు. మేయర్ స్రవంతి, కార్పొరేటర్లు శాంతి, రామ్మోహన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పెస్ట్ ఏజెన్సీపై చర్యలకు వినతి

నెల్లూరు(అర్బన్): నగరంలోని జీజీహెచ్‌లో చెదలు పట్టి పలు వార్డుల్లో ద్వారబంధనాలు, తలుపులు, కిటికీలు పనికిరాకుండా పోవడానికి కారణమైన పెస్ట్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని ఏపీ, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆదిత్యసాయి, లీలామోహన్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ పెద్దాస్పత్రిలో సూపరింటెండెంట్ సిద్ధానాయక్‌కు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. సంజయ్‌కుమార్, సాజిద్ పాల్గొన్నారు.